క్లుప్తంగా

ఎంపీ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణం



మొలకలపూడి వద్ద నిర్మించిన బస్ షెల్టర్

చిట్టమూరు : తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి నిధులతో మండలంలోని మొలకలపూడి గ్రామ సమీపంలో నూతనంగా బస్ షెల్టర్ నిర్మించారు. నాయుడుపేట–మల్లాం రహదారిపై మొలకలపూడి వద్ద ఉన్న బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.4 లక్షలు మంజూరు చేశారు. స్థానికులు ఎంపీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వైభవంగా కార్తీక వన భోజనాలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణ సమీపంలోని మోదుగవనంలో వెలసిన వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో వన భోజనాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పురంధరరాజు, సభ్యులు సుబ్రమణ్యంరాజు, దామోదర్‌రాజు, బాలకృష్ణంరాజు, నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కందలిలో బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ కోటయ్య

గూడూరు రూరల్ : గూడూరు మండలంలోని తిప్పవరప్పాడు, కందలి పంచాయతీల్లోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. భారీ వర్షాల వల్ల గ్రామాల్లో నీరు నిలిచి అధ్వానంగా మారింది. ఈ క్రమంలో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టారు. కందలి గ్రామంలో సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రటరీ కోటయ్య ఆధ్వర్యంలో కూలీలు వీధుల్లో బ్లీచింగ్ చల్లి, మురుగు కాలువలను శుభ్రం చేశారు. నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించారు.

సైదాపురంలో...



పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శశిఇంద్రాణి తెలిపారు. తూర్పువీధి, పడమరవీధి, ఎస్సీ, ఎస్టీ కాలనీతో పాటు, దాడిశెట్టిపల్లి, మొలకలపూండ్ల గ్రామాల్లో కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యురాలు ఇందిరమ్మ తదితరులున్నారు.

నేడు సిద్ధలయ్యకోనలో తిరునాళ్ల

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురం సమీపంలో వెలసిన సిద్ధలయ్యస్వామి కోనలో కార్తీక మాసం 4వ సోమవారం తిరునాళ్లు ఘనంగా నిర్వహించనున్నారు. ఇక్కడ దైవాంశ సంభూతులైన యోగీశ్వరులు శ్రీనవకోటి సిద్ధలయ్య, నవనాథు సిద్ధలయ్య, వారి ప్రియ శిష్యులు సారంగధరుడు వెలసి ఉన్నారు. చివరి 4వ సోమవారం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులకు ఆకతాయిల నుంచి ఇబ్బంది లేకుండా బందోబస్తు ఏర్పాటుచేసినట్టు ఎస్ఐ వాసు తెలిపారు.

సంప్రదాయాన్ని కొనసాగించాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ భరద్వాజ తీర్థంలో మునీశ్వరస్వామి, గుర్రప్ప స్వామి, చెంచు లక్ష్మమ్మ ఇంటి దేవుళ్లకు పొంగళ్లు, యాట పెట్టుకుని పూజించుకునే సంప్రదాయాన్ని కొనసాగించాలని భక్తులు కోరారు. వారు ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఆలయ అధికారులు కొన్ని షరతులతో పూజలు చేసుకోమనడం బాధాకరమన్నారు. మునుపటి సంప్రయదాయాన్ని కొనసాగించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి
- 10వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం



వెంకటగిరి రూరల్ : సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : రాష్ట్రంలో సంక్షేమ పాలన అందించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వెంకటగిరి పట్టణంలోని 10వ వార్డు మనులాలపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన వారు లబ్ధి పొందే విధంగా నవరత్న పథకాలు రూపొందించి ఆదర్శవంతమైన పరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకే తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఇటువంటి సువర్ణ పరిపాలన రాష్ట్రానికి ఎంతో అవసరమని, ఈసారి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, విబ్ పి లక్ష్మి, కౌన్సిలర్లు శివ, గోపాలకృష్ణ, ఆరి శంకరయ్య, ఆటంబాకం శ్రీనివాసులు, వహీద, కందాటి కళ్యాణి, ప్రభావతి, జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాది ఎల్ కోటేశ్వరరావు, నాయకులు సిహెచ్ మురళీ, రొంటాల చిన్నా, తోట గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.45 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి చర్యలు

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని 12వ వార్డు సవారిగుంట లోతట్టు ప్రాంతంలో రూ.45 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సవారిగుంట లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరిలో కురిసిన భారీ వర్షాలకు 12వ వార్డులోని సవారిగుంటలో వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మోటార్లతో నీటిని తొలగించి శుభ్రం చేసినట్టు వివరించారు. ఇక్కడ శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా మట్టితో ఎత్తు చేసి సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని చెప్పారు. వెంకటగిరిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో నిధులు మంజూరు చేయనున్నారని వివరించారు. రూ.45 లక్షలతో సవారిగుంటలో రోడ్లతోపాటు పలుచోట్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో 12వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపడతామన్నారు.

మంచి మనసున్న సీఎం జగన్

రాపూరు: ఎల్లవేళలా పేదలకు మంచి చేయాలనే మంచి మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వెఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం రాపూరు తూర్పు అగర్తకట్టలోని చల్లా యానాదులకు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తూర్పు అగర్తకట్టలోని చల్లాయానాదులకు త్వరలో స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించేందుకు కృషి చేస్తానన్నారు. నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సర్పంచ్ జయమ్మ, మధుసూదన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, గౌస్‌పీర్, వెంకటరమణారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



రాపూరులో చల్లాయానాదులకు సరుకులు అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

మరమ్మతులపై దృష్టి సారించాలి



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్ : భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువు కట్టలు, రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అధికారులను ఆదేశించారు. ఆయన ఆదివారం మన్నేముత్తేరి పంచాయతీ జంగాలగుంట, ఉల్సాపడవ రోడ్డు, దెబ్బతిన్న చెరువు కట్టలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తెగిన చెరువు కట్టలకు ఇసుక బస్తాలు వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వరదలకు కోసుకుపోయిన రోడ్లను బాగు చేసి రాకపోకలు సాగించేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ ఎద్దల చిన్నరాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి వేణు, అల్లూరు రమేష్ రెడ్డి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్ రామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ అయితా శ్రీధర్ పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ పునరుద్ధరణ పనులు



చింతవరం చెరువు వద్ద విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చిల్లకూరు : తుపాను బీభత్సంతో పలు గ్రామాల్లో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏఈ మునిశేఖర్ తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలోని వరగలి విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లే ఫీడర్ లైన్లకు స్తంభాలు చింతవరం సమీపంలోని చెరువులో పడిపోయాయన్నారు. నీరు ఎక్కువగా ఉండడంతో వాటిని బయటకు తీసేందుకు వీలుకాలేదన్నారు. ఆదివారం కొంతమేర నీరు తగ్గడంతో స్తంభాలను వెలికితీసి నాటుతున్నట్టు చెప్పారు. పనులు వేగవంతం చేసి ప్రజలకు విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు.

డయాలసిస్ సెంటర్ ప్రారంభం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని చర్చివీధిలో ఉన్న అమరావతి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆదివారం ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, దేగపూడి కృష్ణారెడ్డి, వేణురెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, శశి తదితరులు పాల్గొన్నారు.



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

వరద బాధితులకు సరుకులు

దొరవారిసత్రం : మండలంలోని తల్లంపాడు ఎస్సీ, ఎస్టీ కాలనీ, మోదుగులపాళెం, బురదమడుగు తదితర గ్రామాల్లోని వరద బాధితులకు ఆదివారం స్థానిక రెవెన్యూ అధికారులు 25 కేజీల బియ్యం, కేజీ నూనె, కేజీ కందిపప్పు అందజేశారు. మండలంలో 1496 కుటుంబాలు వరదల్లో చిక్కుకుపోయి పునరావాస కేంద్రాల్లో ఉన్నట్టు తహసీల్దార్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 1000 కుటుంబాల కు సరుకులు అందజేశామన్నారు. మిగిలిన వారికి కూడా రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. వీఆర్వో వెంకటరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.



తల్లంపాడు ఎస్టీ కాలనీ వరద బాధితులకు సరుకులు అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

కంటి వైద్యం శిబిరానికి విశేష స్పందన

చిల్లకూరు : మండలంలోని చిల్లకూరు ప్రధాన పాఠశాలలో ఆదివారం పెళ్లకూరు మండలానికి చెందిన చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 120 మందికి పరీక్షలు చేసి 50 మందికి మందులు, 30 మందికి కంటి అద్దాలు అందజేశారు. 10 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామనాయుడు, ట్రస్టు ఏవో గల్లా క్రిష్ణ, అరవింద నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో ట్రస్టు నిర్వాహకులు

పూర్వ విద్యార్థుల సమావేశం



కోట హైస్కూల్‌లో కలసిన పూర్వ విద్యార్థులు

కోట: స్థానిక ఏవీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–99 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుబ్బారెడ్డి, ప్రసన్నమ్మ, శంకరయ్య, రాఘవయ్య, ఈశ్వరరెడ్డిని ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, సాయంత్రం వరకు సందడి చేశారు.

పంట నష్టం వివరాల సేకరణ



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయకురాలు

సైదాపురం: మండలంలో భారీవర్షాలకు నీట మునిగిన వరి, నేలకొరిగిన బొప్పాయి, నిమ్మ చెట్లను వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేస్తున్నారు. మండలంలోని సైదాపురం, తోకలపూడి, చాగణం తదితర గ్రామాల్లో ఆదివారం మిరప, నిమ్మ, బొప్పాయి తోటలను పరిశీలించారు. నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపించి పరిహారం అందేలా చూస్తామన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఆలయానికి వచ్చిన స్థానికులు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆలయంలో అమర్చిన సీసీ పుటేజీని పరిశీలించగా శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి సీసీకెమెరాను పక్కకు మళ్లించి చోరీకి పాల్పడిట్లు గుర్తించారు. హుండీలో సుమారు రూ.50 వేల వరకు నగదు చోరీకి గురై ఉండవచ్చని స్థానికులు తెలిపారు.

భవహరణా.. శుభచరణా



కార్తీక దీపానికి పూజలు

శ్రీకాళహస్తి: ఓం నమఃశ్శివాయ నామస్మరణతో శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రతిధ్వనించింది. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తున్నారు. ఆదివారం రాత్రి ఊంజల్ సేవ మండపం వద్ద ఏర్పాటు చేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు ఓం నమఃశ్శివాయ అంటూ ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

కండలేరులో 13.102 టీఎంసీల నీరు

రాపూరు:కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 13.102 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 150 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధితులకు ప్రభుత్వం అండ



చిల్లకూరు : తిక్కవరం గిరిజన కాలనీలో బియ్యం పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్ పర్సన్ యమునమ్మ



చిల్లకూరు : కోరావారిపాళెంలో సరుకులు అందజేస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చిల్లకూరు : తుపాను బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని జెడ్పీటీసీ మన్నెం శీనయ్య, గూడూరు ఏఎంసీ చైర్ పర్సన్ ఓడూరు యమునమ్మ తెలిపారు. వారు ఆదివారం తిక్కవరం, గిరిజన కాలనీ, బల్లవోలు పంచాయతీ కోరావారిపాళెం గ్రామాల్లో బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ తిక్కవరం గిరిజన కాలనీలో 63 కుటుంబాలు, కోరావారిపాళెంలో 90 కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్టు తెలిపారు. అలాగే పూర్తిగా నిరాశ్రయులైన 14 కుటుంబాల గిరిజనులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు మారంరెడ్డి అమరనాథ్ రెడ్డి రూ.20 వేల సాయం అందించారు. సర్పంచులు ఓడూరు సతీష్‌రెడ్డి, దువ్వూరు మంజులమ్మ, నాయకులు ఓడూరు బాలక్రిష్ణారెడ్డి, దువ్వూరు క్రిష్ణారెడ్డి, దువ్వూరు కిరణ్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు శ్రీనివాసులు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

179 టన్నుల బియ్యం పంపిణీ

కోట: మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బియ్యం, నిత్యావసరాల పంపిణీని చురుగ్గా చేపట్టినట్టు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఇప్పటి వరకు 179 టన్నుల బియ్యం పంపిణీ చేశామన్నారు. మండలంలో 7168 మంది లబ్ధిదారులకు 25 కేజీల బియ్యంతో పాటు కేజీ నూనె, కంది పప్పు, యర్రగడ్డలు, బంగాళదుంపలు అందజేసినట్లు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికి రూ.2500 వంతున అందజేసినట్లు తెలిపారు.

వరద బాధితులకు సరుకుల పంపిణీ

వాకాడు : మండలంలోని పులింజేరివారి పాళెంలోని 40 కుటుంబాల వరద బాధితులకు ఆదివారం ఎస్ఆర్ఐ రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతుల దాతృత్వంతో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. దీవి అనంతాచార్యులు, కొడవలూరు హరీష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేంద్ర, పాల్‌రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో ఆదివారం సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్దారెడ్డి జనార్ధన్‌రెడ్డి దివ్యాంగుల చేయూత కార్యక్రమం కింద నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ దేవస్థానం చైర్మన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రజేంద్రరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ



సరుకులు అందజేస్తున్న సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ

అ'పూర్వ' సమ్మేళనం



సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఓజిలి: మండలంలోని కురుగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. కుటుంబ సభ్యులను, వారి స్థితిగతులు, సంతోషాలను ఒకరికొకరు పంచుకుని ఆనందంతో ఉప్పొంగిపోయారు. పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అవసరమని హెచ్‌ఎం శారద కోరారు. స్పందించిన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పుచ్చలపల్లి పద్మజారెడ్డి రూ.50 వేలు విలువైన వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, కన్నా సుధాకర్, గురుస్వామి, హరిబాబు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

చిట్టమూరు : మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఆరూరు, తాడిమేడు, అరవపాళెం, మల్లాం, ఎల్లూరు, చిల్లమూరు గ్రామాల చెరువులు నిండాయి. దీంతో రైతులు పొలాలను దుక్కిదున్ని మడులు సిద్ధం చేసుకుని వరి నాట్లు వేస్తున్నారు. స్వల్పకాలిక షుగర్ లెస్ రకాన్ని ఎక్కువ మంది సాగుచేస్తున్నారు. కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇతర గ్రామాల నుంచి వాహనాల్లో కూలీలను తీసుకువచ్చి నాట్లు వేయిస్తున్నారు. వరదల వల్ల నారుమడులు దెబ్బతినడంతో అనుకున్నంత మేర నారు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. ఎకరాకు నారు వేయడానికి మొత్తం రూ.5500 కూలి తీసుకుంటున్నారని తెలిపారు.



చిట్టమూరు: వరినాట్లు వేస్తున్న కూలీలు

పెళ్లకూరులో..

పెళ్లకూరు: భారీ వర్షాలకు మండలంలోని చెరువులు నిండాయి. వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. దీంతో రైతులు వరినాట్లు వేస్తున్నారు. కూలీలకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన కొందరు ముఠా కూలీలు(పురుషులు) పెళ్లకూరు పరిసర ప్రాంతాల్లో వరినాట్లు వేసే పనులు చేస్తున్నారు. నారును వరుస క్రమంలో చక్కగా నాటడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



పెళ్లకూరులో వరినాట్లు వేస్తున్న పురుషులు

నీలకంఠేశ్వరుడికి భస్మాభిషేకం

కలువాయి: కలువాయి శ్రీ రాజరాజేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భస్మాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేవీ నరసింహారావు ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, విభూదితో అభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమానికి సహకరించిన అందరికీ శివభక్తమండలి వారు ధన్యవాదాలు తెలిపారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు